క్లుప్తంగా

పోలూరి శతజయంతి సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం) : ఆంధ్ర వాల్మీకి బ్రహ్మశ్రీ పోలూరి హనుమ జానకీరామశర్మ శతజయంతి ఉత్సవాల 8వ సమావేశం పుర మందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరుగనుందని నిర్వాహకుడు వేదం రాధాకృష్ణ మూర్తి శుక్రవారం తెలిపారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్ష తన జరిగే సమావేశంలో తిక్కన సోమయాజి నాటకంపై డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు ఉపన్యాసం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం రేపు

నెల్లూరు(బారకాసు) : నగరంలోని వీఆర్ కళాశాలలో 1978 నుంచి 1981 మధ్య బీఎస్సీ చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నగరంలోని దర్గామిట్టలో ఉన్న మినర్వగ్రాండ్‌లో ఆదివారం జరుగుతుందని ఆ పూర్వ విద్యార్థులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు, క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, అరబిందో ఫార్మా డైరెక్టర్ ఎం.మదన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుంది.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



నెల్లూరు (టౌన్) : రూరల్ మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ హామీ మేరకు 117 జీఓను రద్దు చేయాలన్నారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షుడు రఘు, జిల్లా అధ్యక్షులు సుధీర్‌బాబు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత దినోత్సవం



సంగీత గురువులకు సన్మానం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని ఇస్కాన్ సిటీలో ఉన్న హనుమాన్ ఆలయంలో నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంగీత ఉపాధ్యాయులు శ్రీవత్సల, ఎం.ఇందిర వారి శిష్యబృందంతో పలు కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

'నేను బడికి పోతా'పై అవగాహన ర్యాలీ



నెల్లూరు (టౌన్) : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమంపై స్థానిక జిల్లా బాలికల ఉన్నత పాఠశాల నుంచి పొదలకూరురోడ్డులోని పద్మావతి సెంటర్ వరకు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బడి మానేసిన పిల్లలు మళ్లీ బడిలో చేరాలంటూ ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ బడిఈడు పిల్లలను వందశాతం పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ సుధీర్‌బాబు, రూరల్ ఎంఈఓ మురళీధర్, స్థానిక కార్పొరేటర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాల పంపిణీ రేపు

నెల్లూరు(బృందావనం) : నగరపాలక సంస్థ పరిధిలో 2023–2024 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన 36 మంది విద్యార్థులకు శ్రీరేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను ఆదివారం అందజేస్తున్నట్లు టౌన్‌హాల్ ట్రస్టు బోర్డు శుక్రవారం తెలిపింది. కార్పొరేషన్ పరిధిలోని 36 మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించిన 36 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందజేస్తారన్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని, జయప్రదం చేయాలన్నారు.

అండగా ఉంటా.. భయపడొద్దు

• మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



కూల్చివేతకు గురైన వైఎస్సార్‌సీపీ నేత దుకాణాన్ని పరిశీలిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. తొలుత 41వ డివిజన్ కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, తెలుగుదేశం పార్టీ నాయకుల చేతిలో గాయపడిన 29వ డివిజన్‌కు చెందిన సాజిద్, అదే డివిజన్‌లో బలవంతంగా తొలగించిన వైఎస్సార్ సీపీ నేత సీహెచ్ సూరిబాబు దుకాణాన్ని సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని, పార్టీ అధిష్టానంతో పాటు తాము అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన షేక్.సాజిద్‌కు ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం ఆదాల మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, ప్రతి డివిజన్‌ను సందర్శించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులు, అభిమానులను స్వయంగా కలుస్తానన్నారు. అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, డాక్టర్ షేక్ సత్తార్, పార్టీ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, స్వర్ణ వెంకయ్య, మల్లు సుధాకర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్, పేర్నాటి కోటేశ్వర్‌రెడ్డి, కువ్వాకొల్లు బాబ్జి యాదవ్, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, పాలకీర్తి రవికుమార్, కొండ సాయిరెడ్డి, కల్లూరు లక్ష్మీరెడ్డి, వేల్పుల రజిని, అనిత, నారాయణరెడ్డి, హరిచంద్రారెడ్డి, పాశం తిరుపతి, నాయబ్ రసూల్, ఖాదర్ మస్తాన్, జాకీర్, అలాభక్షు, ఖలీల్, నరసింహారెడ్డి, నరసింహారావు, అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ నేతల దాడిలో గాయపడిన సాజిద్‌ను పరామర్శిస్తున్న ఆదాల

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని మూలాపేటలో ఉన్న శంకరమఠంలో చండీహోమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన చండీహోమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా కొల్లూరు లక్ష్మీనరసింహం దంపతుల వ్యవహరించారు. నిర్వాహకులు కొత్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.



దేశంలో ప్రగతి పరుగులు

నెల్లూరు(మినీబైపాస్) : ప్రధాని నరేంద్రమోదీ చొరవతో భారతదేశంలో ప్రగతి పరుగులు పెడుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. స్థానిక రామ్మూర్తినగర్‌లో ఉన్న బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని తన సహాయ సహకారాలు అందిస్తానని మాట ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరిపాలన సాగించాలని హితవు పలికారు. అసెంబ్లీలో నిర్మాణాత్మక చర్చలు జరగాలని, అందులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కూడా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్, దాసరి రాజేంద్రప్రసాద్, గంజం పెంచలప్రసాద్, రాధాకృష్ణగౌడ్, లెక్కల రాజశేఖర్‌రెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్నాటి ఆంజనేయరెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్ శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

• డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని అలంకార్ సెంటర్, బ్రాహ్మణవీధి, రాజాగారివీధి, శివాలయం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయి.

• ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో బ్రహ్మానందపురం, బెజవాడ ఓబుల్‌రెడ్డినగర్, డీఈఓ కార్యాలయం, బొల్లినేని ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

• నగరంలోని బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో సప్తగిరి కాలనీ, సప్తగిరి లేఅవుట్, జనశక్తి నగర్, కొండాయపాళెం, పాత వేదాయపాళెం, కావేరినగర్, భవానీ స్కై టవర్స్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు వసతుల కల్పన



బాధితులను పరామర్శిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

• కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని బర్మాషల్ గుంట ప్రాంతంలో అగ్నిప్రమాద బాధితులను కమిషనర్ వికాస్‌మర్మత్ శుక్రవారం పరామర్శించారు. బాధితులకు తాగునీరు, పారిశుద్ధ్యం, మెడికల్ క్యాంపులను తక్షణమే ఏర్పాటు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. గ్యాస్ సిలిండర్లు అందజేసి వారికి గతంలో కేటాయించిన ప్రభుత్వ గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల వారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అధికారులు బాధితులకు తాగునీరు ఏర్పాటు చేసి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ప్రమాద ప్రదేశంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సేవలతో పాటు మందులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో మందులను అందజేస్తున్న వైద్య సిబ్బంది

బ్రిడ్జిపై నుంచి పడి వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్) : ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి(35) ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి స్టోన్‌హౌస్‌పేట వెళ్లే రహదారి వైపు కింద పడడంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. వెంటనే అక్కడున్న వ్యాపారులు అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుడిని ఆటోలో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం.బాబి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తొలుత ఏదైనా వాహనం ఢీకొనడంతో పైనుంచి కింద పడి ఉంటాడని భావించారు. పైకి వెళ్లి చూడగా యాక్సిడెంట్ జరిగిన ఆనవాళ్లు లేవు. దీంతో ఆత్మహత్య చేసుకున్నాడా? లేకా ఎవరైనా తోసేశారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడు డార్క్ బులుగు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బిస్కెట్‌రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని కుడిచేతిపై తులారాం అని ఇంగ్లిష్‌లో రాసి ఉంది. మృతుని జేబులో ఈ రోజు కావలి నుంచి నెల్లూరు వచ్చినట్లు ఆర్టీసీ టికెట్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94407 96306 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ బాబి కోరారు.



గుర్తుతెలియని మృతదేహం

విద్యార్థికి ఆర్థిక సాయం



నెల్లూరు సిటీ : నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న శ్రీవివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఏడో తరగతి విద్యార్థి విశాల్‌కు హ్యాండ్స్ ఆన్ ఫౌండేషన్ ద్వారా రూ.12,600లను శుక్రవారం అందజేశారు. ఈ మేరకు ఫౌండర్ రమేష్ చెక్కును స్కూల్ హెచ్ఎంకు అందజేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

• ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు



నెల్లూరు(క్రైమ్) : యోగసాధన చేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది



నెల్లూరు(బారకాసు) : మోడరన్ హైస్కూల్ మైదానంలో..

నెల్లూరు(క్రైమ్) : సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేందుకు యోగసాధన తోడ్పడుతుందని ఏఆర్ ఏఎస్పీ జి. శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీసు కవాతు మైదానంలో యోగా గురువు(హెడ్ కానిస్టేబుల్) మురళీ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ అధికారులు, సిబ్బంది అపాన వాయుముద్ర, ప్రాణామాయం, చిన్నయముద్ర, జ్ఞానముద్ర, నమస్కారముద్ర యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ భారతీయ వారసత్వ సంస్కృతిలో యోగా భాగమని, భారతదేశం ప్రపంచానికి అందించిన విలువైన బహుమతుల్లో ఒకటన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆరోగ్యం, శరీర సౌష్టవం కోసం ప్రతిరోజు యోగా చేయాలన్నారు. యోగా ద్వారా మానసిక ఒత్తిడిని జయించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందన్నారు. యోగాను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, సంతపేట ఇన్‌స్పెక్టర్ ఎ.సుబ్బరాజు, ఆర్ఐలు అంకమరావు, శ్రీహరిబాబు, రాజారావు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో..

నెల్లూరు(మినీబైపాస్) : స్థానిక స్టోన్‌హౌస్‌పేట తపాలా కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ సావర్కర్, రమేష్, ఈస్ట్ ఐపీఓ శ్రీనివాసులు, పోస్ట్ మాస్టర్ రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాయిని..

నెల్లూరు(బారకాసు) : యోగా ఆరోగ్య ప్రదాయిని అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ మోడల్ హైస్కూల్ మైదానంలో యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా రవి, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, రామ్‌దేవ్ బాబా పతంజలి జిల్లా కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. స్థానిక బీజేపీ నేతలతో పాటు దాదాపు 150 మంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో..

నెల్లూరు (టౌన్) : నగరంలోని పలు విద్యాసంస్థల్లో యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించి యోగా ప్రాధాన్యతను వివరించారు. డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. ఎన్ఎస్ఎస్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్, నెహ్రూ యువకేంద్రం, యోగ మిత్రమండలి సంస్థల సౌజన్యంతో కార్యక్రమం జరిగింది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, పూర్ణచంద్రకుమారి, హాస్టల్ సూపర్‌వైజర్ యమున, న్యాయవాది రమాదేవి, మహబూబ్‌బాషా, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో..

స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో యోగా తరగతులు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ విజయకళ, అధ్యాపకులు చెంచురామయ్య, సత్యనారాయణ, కరుణశ్రీ, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ బాలికల హైస్కూల్లో..

స్థానిక పొదలకూరురోడ్డులోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, ఏఎంఓ సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, ఎంఈఓ మురళీధర్, డివిజన్ ఇన్‌చార్జి సునీల్, హజరత్తయ్యా నాయుడు, హెడ్‌మాస్టర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సాయి మిలీనియం స్కూల్లో..

చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులోని సాయి మిలీనియం స్కూల్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ట్రైనర్ లక్ష్మీదేవి విద్యార్థులతో ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రామిరెడ్డి అజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాకు అంతర్జాతీయ ఖ్యాతి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ప్రధాని నరేంద్రమోదీ వల్లే యోగాకు అంతర్జాతీయ ఖ్యాతి వచ్చిందని నెల్లూరు ప్రభుత్వ బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వేణుగోపాల్ అన్నారు. సంతపేటలోని కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. యోగా మాస్టర్ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను జీవితంలో భాగంగా అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీ ఎం.రవీంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ఉన్న ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్ పాల్గొని, యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో స్పాస్టిక్స్ సెంటర్‌కు చెందిన ఉమామహేశ్వరి, వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓ కార్యాలయంలో..

నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో యోగా దినోత్సవం నిర్వహించారు. డీఎంహెచ్ఓ పెంచలయ్య పాల్గొని, యోగా ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగా అవసరం

నెల్లూరు(బృందావనం) : ఆరోగ్య పరిరక్షణ, మనోవికాసం, మానసిక ఒత్తిడిని అధిగమించి శరీర పటుత్వం కోసం యోగాసనాలు, ప్రాణయామం, ధ్యానం ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని హార్ట్ ఫుల్‌నెస్ కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.వెంకటకృష్ణ తెలిపారు. నగరంలోని పొదలకూరురోడ్డు గౌతమినగర్ రెండో వీధిలో శ్రీరామచంద్ర మిషన్ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. శ్రీరామచంద్ర మిషన్, ఆయుష్, యోగా మిత్రమండలి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, యువజన సర్వీసులు సంయుక్త సౌజన్యంతో యోగా దినోత్సవాన్ని జరిపించారు. ఆయుష్ జిల్లా శాఖాధికారి డాక్టర్ గోవిందయ్య, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్కే యతిరాజ్, యోగా మిత్రమండలి కార్యదర్శి ఎం.రవీంద్ర మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరంలోని వివిధ విద్యాసంస్థలు, నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు, యువజనులు పాల్గొన్నారు. ఆయుష్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేదం, హోమియో, యునానీలకు సంబంధించి ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత డీపీఆర్వో వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో అనారోగ్యాలు దూరం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : యోగా సాధన ద్వారా అనారోగ్యాలు దూరం చేయవచ్చని మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి అన్నారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం యోగాసనాల గురించి యోగా నిపుణులు ప్రసన్నకుమార్, స్వప్న వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ యశ్వంత్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్, వైద్యులు పాల్గొన్నారు.

• నెల్లూరు(బారకాసు) : యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని వికాస్ స్కూల్ ప్రిన్సిపల్ కర్తం జ్యోతిప్రతాప్ అన్నారు. నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న వికాస్ హైస్కూల్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు.



నెల్లూరు(క్రైమ్) : యోగాసనాలు వేస్తున్న ఏఆర్ ఏఎస్పీ, నగర డీఎస్పీ, యోగాగురువు



నెల్లూరు(మినీబైపాస్) : తపాలా కార్యాలయంలో..



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : సంతపేటలో..



నెల్లూరు (టౌన్) : డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల హాస్టల్‌లో..



నెల్లూరు (టౌన్) : డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో..



నెల్లూరు (టౌన్) : జెడ్పీ బాలికల హైస్కూల్లో..



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రెడ్‌క్రాస్ సొసైటీలో..



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద..



నెల్లూరు(బృందావనం) : యోగా సాధన గురించి వివరిస్తున్న నిర్వాహకులు



నెల్లూరు(బృందావనం) : యోగాసనాలు చేస్తున్న యువకులు, పెద్దలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : మెడికవర్ ఆస్పత్రిలో..